


# అదృష్టం తట్టిన తలుపు

యస్.వి.యస్. ద్వారకనాథ్

ముచ్చటగా మూడుగదులు, ఒక చిన్న వసారా, తగుమాత్రం విశాలమయిన హాలు, చుట్టూతిగినంత ఆవరణ కలిగి ఆ ఇల్లు చూడముచ్చటగా ఉంది. ఆవరణలో అక్కడక్కడ నాలుగయిదురకాల పూలమొక్కలున్నాయి. చూసీ చూడగానే ఆ ఇలు నన్ను ఇట్టే ఆకర్షించింది. పెరట్లోకి వెళ్ళి చూశాను. చక్కని చిన్ననుయ్యి ఉంది. రెండుబారలకంటె ఎక్కువలోతు లేదు. వంగి ఒక్క చేతలో చేదనునీరు తోడి చవిచూశాను. ఓహ్! చాలా రుచిగా ఉన్నాయి. కాశీగంగలా మధురంగా వున్నాయి. పక్కకి చూద్దునుగదా తాళం చెవి ఆడిస్తూ ఇంటి యజమాని నిలబడి వున్నాడు.

"ఎలాఉంది ఇల్లు?" అని అడిగా డాయన.

"బొమ్మరిల్లులా ఘస్టుగావుంది. మీరు చెప్పిన అద్దెకూడా నాకు అంగీకారమే" అన్నాను నేను.

చిరునవ్వు అణుచుకుంటూ ఆయన "అయితే ఈ తాళంచెవి తీసుకోండి. ఈ వేళనుంచే అద్దె లెక్క వేసుకుందాం" అన్నాడు. అభ్యంతరం లేదన్నట్లు తలఊపి ఆయనదగ్గరనుంచి తాళం చెవి తీసుకున్నాను. ఇంతలో ఆయన కేదో జ్ఞాపకంవచ్చింది కాబోలు "అన్నట్టు అడగడం మరిచాను. మిగతా మీ కుటుంబమంతా ఎప్పుడు వస్తారు?" అని ప్రశ్నించాడు.

"ఇంతకుపూర్వమేకదా చెప్పాను మీకు! కొత్తగా నాకీ ఊరు బదిలీ అయింది. నేను వచ్చి మూడురోజులైంది. ఇక్కడ ఇల్లూ వాకిలీ కుదిరాక వెళ్ళి కుటుంబాన్ని తీసుకురావా లనుకొంటున్నాను. ఇదిగో ఇంక వీలుచూసుకుని ఒకరోజు సెలవుపెట్టి వెళ్ళి వాళ్ళను తీసుకురావాలి" అన్నాను.

"ఔనౌను. పాపం మీరు చెప్పారు. నేనే మర్చిపోయాను. నాకు జ్ఞాపకశక్తి కొంచెం తక్కువలెండి. ఇదిగో, మరివస్తాను" అన్నా డాయన ముందుకు నడుస్తూ.

"అశ్చే, దానిదేముందిలెండి. ఫరవా లేదు" అని చెప్పి ఆయన్ని గేటువరకు వెళ్ళి సాగనంపాను.

అమ్మయ్య!

ఇప్పటికొక పెద్దసమస్య తీరింది. ఇంత త్వరలో ఇల్లు—అందులోనూ సర్వస్వతంత్రమైన ఇల్లు—దొరుకుతుందని నేను కలలో కూడ అనుకోలేదు. ఇంటి యజమాని దేవుడిలాగా హఠాత్తుగా తటస్థపడ్డాడు. అడిగీ అడగడంతోనే రెండోమాటలేకుండా నన్ను వెంటబెట్టుకొని ఇల్లు చూపించడానికి బయలుదేరి వచ్చాడాయన. వస్తున్నప్పుడు దారిలో నా పేరు, ఉద్యోగం గురించి తప్ప రెండో ప్రశ్న వేయలేదు. మితభాషిలాగ వున్నాడు. నేనే సవివరంగా నన్ను గురించి పరిచయం చేసుకున్నాను. కాని ఆయన నామాటలు విన్నాడో లేదో నేను చెప్పలేను. నడుస్తున్నంతసేపూ ఏదో ఆలోచిస్తున్నట్టుగానే కనపడ్డాడు.

